
సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 13 । జూన్ । 2023



నేటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలోని జిల్లాలో డిగ్రీ కోర్సుల్లో 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి.

- 8లో▸



నిట్‌లో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ఎంటెక్

నిట్ వరంగల్‌లో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో ఎంటెక్ కోర్సును ప్రారంభించినట్లు నిట్ డైరెక్టర్ తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
40^0 /30^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కేసీఆర్ కృషి

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్



హన్మకొండ: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం బాల కార్మికులకు, వారి తల్లిదండ్రులకు ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరి బాధ్యత అన్నారు. బాలలందరినీ బడికి పంపిద్దామని, వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుదామన్నారు. బలపం పట్టాల్సిన చేతులు బండెడు చాకిరితో ఛిద్రమైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి బాలలే రేపటి పౌరులుగా ఉండాలన్నారు. పిల్లలందరూ పనిలో కాదు – బడిలో ఉండాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేశారన్నారు. గురుకుల విద్యా సంక్షేమ పథకం ద్వారా 9,47,200 మందికి విద్యను అందిస్తున్నారన్నారు. 2025 నాటికి బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా అంతం చేయడానికి ప్రపంచ దేశాలు కృషి చేస్తున్నాయన్నారు.

కుక్క దాడిలో నలుగురికి గాయాలు



వరంగల్ చౌరస్తా: వరంగల్ బట్టల బజార్ (ఆర్ఎస్‌టీ)రోడ్డులో సోమవారం ఓ పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. ఖమ్మంకు చెందిన రాజమ్మ తన మనవరాలితో కలిసి దుస్తులు కొని రోడ్డు పక్కన నడుస్తుండగా.. ఓ కుక్క వెంబడించి కరిచింది. ఎంతకూ వదలకపోవడంతో అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఆమెను కాపాడేందుకు ప్రయత్నించాడు. ఈక్రమంలో ఆయనను కూడా కుక్క కరిచింది. అక్కడే ఉన్న కాశిబుగ్గకు చెందిన నవీన్, కాజీపేటకు చెందిన పర్వేజ్‌ను కూడా కుక్క కరిచింది. రాజమ్మ ముఖంపై తీవ్ర గాయాలవడంతో ఆమె అక్కడే సొమ్మసిల్లి పడిపోయింది. బాధితులను ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. కాంగ్రెస్ నాయకుడు జంగా రాఘవరెడ్డి బాధితులను పరామర్శించారు.

డబుల్ బెడ్రూంలు పంపిణీ చేయాలి : నాయిని



హన్మకొండ చౌరస్తా: ఈనెల 20వ తేదీ వరకు నిరుపేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని లేకపోతే ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ ఇంటిని ముట్టడిస్తామని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులపై ఆయన నిప్పులు చెరిగారు. తొమ్మిదిన్నరేళ్లలో ఏం అభివృద్ధి చేశారని దశాబ్ది ఉత్సవాలు, ఆత్మీయ సమ్మేళనాలు జరుపుకుంటున్నారని ధ్వజమెత్తారు. సీపీ ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో వచ్చే భూ ఫిర్యాదులు 70 శాతం బీఆర్ఎస్ నేతలపైనే అన్నారు. ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ నాయకత్వంలోనే విజయ్‌భాస్కర్, సోదా కిరణ్, రంజిత్‌రెడ్డి భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 'కబ్జాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకులపై ధైర్యంగా ఫిర్యాదులు చేయండి. మీకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది' అన్నారు. అనంతరం భద్రకాళి చెరువును నాయిని బృందం సందర్శించింది. భూబకాసురుల నుంచి భద్రకాళి చెరువును రక్షించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమన్నారాయణ, కాంగ్రెస్ నాయకులు బి.శ్రీనివాసరావు, బిన్ని లక్ష్మణ్, పులి అనిల్, బంక సరళ, బొమ్మతి విక్రమ్, కూర వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్‌గా రవికుమార్

వరంగల్ క్రైం: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా వీఆర్‌లో ఉన్న రవికుమార్‌ను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ. రంగనాథ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రవికుమార్ గతంలో మట్టెవాడ, మడికొండ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

రియల్టర్ల కన్ను.. ఖద్దరు దన్ను..

గ్రేటర్ వరంగల్‌లో ఆగని భూసెటిల్‌మెంట్లు

- అంటకాగుతున్న పోలీసు, రెవెన్యూ అధికారులు
- పోలీస్, పొలిటికల్‌పై పోలీసు కమిషనర్ సీరియస్
- కొనసాగుతున్న అరెస్టులు, సస్పెన్షన్‌ల పరంపర
- పోలీస్‌శాఖలో కలకలం.. వేచిచూసే ధోరణిలో 'మాఫియా'



సాక్షిప్రతినిధి, వరంగల్: చట్ట ప్రకారం నడుచుకోవాల్సిన కొందరు పోలీసులకు ప్రజాప్రతినిధుల ఆదేశాలే శిరోధార్యం అవుతున్నాయి. లేఖలు ఇచ్చి పోస్టింగ్‌లు ఇప్పిస్తున్నందున వారు చెప్పినట్లు వినాల్సిన పరిస్థితులు. పనిలో పనిగా తమ పనిని చక్కదిద్దుకునే క్రమంలో నేతల అనుచరుల భూదందాలకు సహకరిస్తున్న పోలీసులు చివరికి సస్పెన్షన్‌ల బారిన పడాల్సి వస్తోంది. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఏవీ.రంగనాథ్.. అక్రమ వ్యాపారులు, భూ దందాలపై దృష్టి సారించారు. పేదల భూములను కబ్జా చేస్తున్న మాఫియాను నగరంలో కట్టడి చేసేందుకు టీములు ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మద్దతు ఇస్తున్న రాజకీయ నాయకులు, వారికి దన్నుగా ఉంటున్న పోలీస్ అధికారులపై దృష్టి సారించారు. బాధితుల ఫిర్యాదు, నిఘా వర్గాల సమాచారం మేరకు విచారణ జరిపిస్తున్న కమిషనర్ అరెస్టులు, సస్పెన్షన్‌ల పరంపరను కొనసాగిస్తుండడం కలకలం రేపుతోంది.

భూ వివాదాల్లో పోలీసులు..
ఇప్పటికే ఐదుగురిపై వేటు..

అవినీతి పోలీస్ అధికారులపై ఉక్కుపాదం మోపుతున్న సీపీ రంగనాథ్.. వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నారు. ఆరు నెలల వ్యవధిలో కమిషనరేట్‌పై పట్టు బిగించిన సీపీ.. ఇప్పటివరకు నలుగురు సీఐలు, ఓ ఆర్ఐ, ముగ్గురు ఎస్ఐలు సహా పలువురిపై చర్యలు తీసుకున్నారు. ఇందులో అత్యధికం భూతగాదాలు, సెటిల్‌మెంట్ల ఆరోపణలే ఉన్నాయి. భూవివాదం కేసులో మొదటగా సీపీ మట్టెవాడ సీఐ సీహెచ్.రమేశ్‌పై వేటు వేశారు. ఆతర్వాత టాస్క్‌ఫోర్స్‌లో సీఐగా ఉన్న సీఐ నరేశ్‌తోపాటు హెచ్‌సీ శ్యాంసుందర్, మరో ఇద్దరు కానిస్టేబుళ్లను భూసెటిల్‌మెంట్లు, వసూళ్ల ఆరోపణలపై సస్పెండ్ చేశారు. ఇదే సమయంలో రంగురాళ్ల వ్యాపారిని బెదిరించిన ఘటనలో కమిషనరేట్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ సతీశ్‌పై సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించి, రిమాండ్‌కు తరలించి సస్పెండ్ చేశారు. సుమారు 20 రోజుల క్రితం భూఆక్రమణ ఫిర్యాదుపై కేసు నమోదు చేయకుండా బాధితులను నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలపై హసన్‌పర్తి సీఐ ఎ.నరేందర్‌ను వీఆర్‌కు బదిలీ చేసి ఆ తర్వాత సస్పెన్షన్ వేటు వేశారు. తమ భూమిని ఆక్రమించారంటూ చేసిన ఫిర్యాదును పట్టించుకోకుండా ఆక్రమణదారులకు మద్దతుగా నిలిచారన్న బాధితుల ఆరోపణలపై తాజాగా కేయూసీ ఇన్‌స్పెక్టర్ పి.దయాకర్‌పై సీపీ సస్పెన్షన్ వేటు వేయడం చర్చనీయాంశంగా మారింది. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల పైనా పీడీఎస్ బియ్యం దందాతోపాటు మామూళ్లు, బార్ షాపుల నుంచి నెల నెలా వసూళ్లకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో.. తర్వాత ఎవరన్న చర్చ పోలీస్‌శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

కబ్జాకు కానిది అనర్హం..
ఏడు ఠాణాల పరిధిలో ఇదే తంతు..

వరంగల్ మహా నగరంగా మారింది. స్మార్ట్‌గా అభివృద్ధి చెందుతుండడం వల్ల భూముల ధరలు రోజురోజుకూ చుక్కలను తాకుతున్నాయి. దీంతో రూపాయి రూపాయి పోగేసుకుని ఖరీదు చేసిన ప్లాట్లను కబ్జాలు చేసే ముఠాలు పెరిగిపోయాయి. స్థలం కనిపిస్తే చాలు కన్నేసి కబ్జా చేస్తున్నారు. కొందరు చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకొని నకిలీ పత్రాలు సృష్టిస్తుంటే.. మరికొందరు ఖాకీ మద్దతు.. ఖద్దరు దన్నుతో ఆక్రమించి విక్రయాలు జరుపుతున్నారు. 2022 డిసెంబర్ 3న సీపీగా బాధ్యతలు తీసుకున్న సీపీ రంగనాథ్‌కు ఈ తరహా పిటిషన్లే అధికంగా రావడంతో ఓ టాస్క్‌ఫోర్స్ కమిటీనే వేశారు. వరంగల్ నగరంలోని ఏడు ఠాణాల పరిధిలో భూవివాదాలపై కేసులు నమోదైనట్లు టాస్క్‌ఫోర్స్ సమాచారం సేకరించింది. సుమారు 46 మంది వరకు భూకబ్జాలకు పాల్పడినట్లు గుర్తించి.. వీరికి వెనకుండి ఎవరు సహకరిస్తున్నారు? అనే వివరాలను కూడా రాబట్టారు. ప్రక్షాళనలో భాగంగా క్షేత్రస్థాయి విచారణలో ఓ బీఆర్ఎస్ కార్పొరేటర్, మరో కాంగ్రెస్ కార్పొరేటర్, ఓ కార్పొరేటర్ భర్తతోపాటు 15 మందిపై కేసులు పెట్టి జైలుకు పంపారు.

ఉత్సాహంగా తెలంగాణ 2కే రన్

వరంగల్ క్రైం/హన్మకొండ: తెలంగాణ 2కే రన్‌లో హనుమకొండ ప్రాంతానికి చెందిన యువత ఉత్సాహంగా పాల్గొంది. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో తెలంగాణ 2కే రన్‌ను సోమవారం నిర్వహించారు. పరుగును వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. హనుమకొండ కలెక్టరేట్ నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు ఈ పరుగు కొనసాగింది. పబ్లిక్ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరుగులో ప్రథమంగా నిలిచిన యువతకు అధికారులు నగదు పురస్కారాలు అందించారు. సీపీ ఏవీ.రంగనాథ్ మాట్లాడుతూ.. తెలంగాణ పోలీస్ విభాగంలో వస్తున్న మార్పులను చూసి యువత కార్పొరేట్ ఉద్యోగాలకు స్వస్తిపలికి పోలీసు కొలువుల కోసం పోటీపడుతోందన్నారు. హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ 2కే రన్‌లో పాల్గొన్న యువతను అభినందించారు. కార్యక్రమంలో డీసీపీలు మురళీధర్, అబ్దుల్ బారీ, ట్రైనీ ఐపీఎస్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు డీసీపీలు సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సంజీవ్, ఏసీపీలు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, జితేందర్‌రెడ్డి, డేవిడ్‌రాజు, నాగయ్య, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సూచికగా తెలంగాణ రన్
వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: రాష్ట్రంలో శాంతిభద్రతలకు సూచికగా తెలంగాణ రన్ నిలుస్తుందని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ నుంచి ఓ సిటీ వరకు 2కే రన్ నిర్వహించారు. కలెక్టర్ గాలిలోకి బెలూన్‌లను వదిలి క్రీడాజ్యోతి వెలిగించి, జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆజంజాహి మిల్ గ్రౌండ్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు.



రన్‌లో పాల్గొన్న సీపీ రంగనాథ్, కలెక్టర్ సిక్తా, మున్సిపల్ కమిషనర్ బాషా తదితరులు



2కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ అశ్విని

పన్నులు కడుతున్నాం.. నీళ్లివ్వండి

- గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్‌లో ప్రజల ఆవేదన

వరంగల్ అర్బన్: 'ఆస్తి, నీటి, చెత్త పన్నులు చెల్లిస్తున్నాం. మా గొంతు తడిపే ప్రయత్నం ఎందుకు చేయడం లేదు' అని గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌లో పలు కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనుమతి లేని భవన నిర్మాణాలు, ఉల్లంఘనలపై, రోడ్లు, డ్రెయినేజీ కబ్జాలతోపాటు మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. గ్రీవెన్స్‌సెల్‌కు మొత్తం 72 ఫిర్యాదులు రాగా.. అందులో టౌన్ ప్లానింగ్‌కు 35 వినతులు అందాయి. తాగునీటి సమస్య 4 కాలనీల నుంచి ప్రజారోగ్యానికి 5, ఇంజనీరింగ్ సెక్షన్‌కు 20, పన్నుల విభాగానికి 8 చొప్పున ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్‌లు రవీందర్ యాదవ్, అనిస్ ఉర్ రషీద్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ రాజేశ్, సీహెచ్ఓ శ్రీనివాస్‌రావు, ఆర్ఎఫ్ఓ పాపయ్య, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డిప్యూటీ కమిషనర్లు జోనా, శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కారించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

జగదీశ్‌కు నివాళులు అర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి కేటీఆర్



కుసుమానికి కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాలతో ములుగు జెడ్పీ చైర్మన్ జగదీశ్ అంత్యక్రియలు
- పార్థివదేహంపై బీఆర్ఎస్ జెండా కప్పిన మంత్రి కేటీఆర్

8లో▸



జగదీశ్ పార్థివ దేహంపై బీఆర్ఎస్ జెండా కప్పి నివాళులర్పిస్తున్న మంత్రి కేటీఆర్ చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు

బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అంత్యక్రియలు సోమవారం తన స్వగ్రామమైన మల్లంపల్లిలో జరిగాయి. పార్టీ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్‌తోపాటు పలువురు మంత్రులు హాజరై కన్నీటి నివాళులర్పించారు. జగదీశ్ పార్థివదేహంపై బీఆర్ఎస్ జెండా కప్పి ఆయన కుటుంబ సభ్యులను కేటీఆర్ ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. - ములుగు

'పట్టణ ప్రగతి'ని ఘనంగా నిర్వహించండి


అన్ని డివిజన్లలో 'నాడు, నేడు' ప్రదర్శించాలి

- అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించాలి
- సమీక్షలో మేయర్, కమిషనర్

వరంగల్ అర్బన్: తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు పక్కడ్బందీ ఏర్పాట్లు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్‌హాల్‌లో ఈనెల 16న నిర్వహించనున్న పట్టణ ప్రగతి దినోత్సవ ఏర్పాట్లకు సంబంధించి కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, వివిధ విభాగాల అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ సుధారాణి, కమిషనర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ.. గ్రేటర్ పరిధిలో జరిగిన అభివృద్ధి, మంజూరైన నిధులు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన గురించి ప్రజలకు వివరించాలన్నారు. అధికారులు, ఉద్యోగులు కేటాయించిన విధుల్ని అంకితభావంతో నిర్వర్తించి దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బల్దియా ఇన్‌చార్జ్ అదనపు కమిషనర్ అనిస్ ఉర్ రషీద్, ఎస్ ఈ కృష్ణారావు, సీహెచ్ఓ శ్రీనివాసరావు, సీఎంహెచ్ఓ రాజేశ్, ఆర్ఎఫ్ఓ పాపయ్య, డీసీ జోనా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో మేయర్, కమిషనర్ ఆదేశాలివే..

- మహా నగరపాలక సంస్థ పరిధిలో దశాబ్దం కిందటి పరిస్థితులు, రాష్ట్రం సాధించిన తర్వాత జరిగిన అభివృద్ధిని నాడు, నేడు ఫార్మాట్ ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించాలి.
- స్వయం సహాయక సంఘాల మహిళలకు రంగోలి పోటీలు నిర్వహించాలి.
- కేఎంసీ నుంచి బల్దియా ప్రధాన కార్యాలయం వరకు వాహన ర్యాలీ తర్వాత ఎంజీఎం జంక్షన్‌లో భారీ మనవాహారం ఏర్పాటు చేయాలి.
- వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న కార్పొరేటర్లు, ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు, టాయిలెట్ నిర్వహణ, తడి పొడి చెత్త సేకరణలో గృహ, డీఆర్‌సీసీ, అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ, ఎస్‌హెచ్‌జీ, వీధి వ్యాపారులను ఘనంగా సన్మానించాలి.
- బల్దియా పారిశుద్ధ్య కార్మికులకు ఈనెల 16, 17 తేదీల్లో మెడికల్ క్యాంప్ నిర్వహించాలి.
- 18న తెలంగాణ మంచినీటి పండుగ సందర్భంగా తాగునీటి రంగంలో సాధించిన విజయాలపై ప్రచారం చేయాలి.
- 19న తెలంగాణ హరితోత్సవంలో భాగంగా నగరంలోని నర్సరీలకు మహిళలను తీసుకెళ్లాలి.
- ప్రభుత్వాస్పత్రులు, బాలసముద్రం, క్రిస్టియన్ కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో కార్పొరేటర్ల సహకారంతో పెద్దఎత్తున సామూహికంగా మొక్కలు నాటాలి.
- 22న అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వరంగల్ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించాలి.



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, పక్కన కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

ప్రమాదాలు.. పైపైకి

- ఐదు నెలల్లో 684 రోడ్డు ప్రమాదాలు
- 191 మంది మృతి
- నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదాలకు కారణం
- కొన్నిచోట్ల ఇంజనీరింగ్ లోపాలతో తరచూ ఆక్సిడెంట్లు
- హాట్‌స్పాట్‌ల మరమ్మతులతో తగ్గించేందుకు పోలీసుల కృషి

సాక్షి, వరంగల్: ప్రమాదాలతో రోడ్లు రక్తసిక్తమవుతున్నాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం, డ్రంకెన్ డ్రైవ్, అతివేగంతో పాటు రోడ్ల నిర్మాణంలో ఇంజనీరింగ్ లోపాలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఈఏడాది జనవరి నుంచి మే వరకు 684 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో 191 మంది మృతి చెందారు. 774 మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో 66 మంది తీవ్రంగా గాయపడగా.. 517 మంది స్వల్పంగా గాయపడ్డారు. కొంత మంది స్వయంకృతాపరాధంతో ప్రాణాలు పోగొట్టుకోగా.. చాలామంది రోడ్డు భద్రత నిబంధనలు పాటించినప్పటికీ ఇతరుల తప్పిదం వల్ల ప్రాణాలు కోల్పోయారు.

మే నెలలోనే అత్యధికం..

ఈఏడాది అత్యధిక రోడ్డు ప్రమాదాలు మే నెలలోనే జరిగాయి. ఓవైపు ఎండలు మండాయి. మరోవైపు రోడ్లు రక్తంతో తడిసిపోయాయి. మే నెలలో 170 రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. జనవరిలో 120, ఫిబ్రవరిలో 127, మార్చిలో 158, ఏప్రిల్‌లో 109 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. జనవరి నుంచి మార్చి వరకు పెరిగిన రోడ్డు ప్రమాదాలు ఏప్రిల్‌లో కాస్తా తగ్గాయి. మేలో మాత్రం మళ్లీ పెరిగాయి.

ఎక్కడ ఎక్కువగా జరుగుతున్నాయంటే...

- రాఘవాపూర్ క్రాస్, చాగల్, ఘన్‌పూర్ బస్టాండ్, చిలుకూరుగుట్ట క్రాస్ నుంచి ఎల్లమ్మగుడి వరకు చిన్నపెండ్యాల, పెద్ద పెండ్యాల, కరుణాపురం, ఔటర్ ఎంట్రెన్స్, ఔటర్ రోడ్డుపై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.
- హసన్‌పర్తి మార్గంలోనూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర కేయూసీ క్రాస్ రోడ్డు నుంచి బావుపేట వరకున్న రహదారి ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా బావుపేట క్రాస్, ఎల్లాపూర్ బ్రిడ్జి, సీతంపేట క్రాస్, హసన్‌పర్తి పెద్ద చెరువు క్రాస్, హసన్‌పర్తి సెంటర్ టు ఎల్లమ్మగుడి, నల్లగట్టు నుంచి ఎర్రగట్టుగుట్ట క్రాస్, అక్కడి నుంచి రామారం వరకున్న రోడ్లు ప్రమాదాలకు హాట్‌స్పాట్‌లుగా మారాయి.
- అదేవిధంగా వరంగల్, హనుమకొండ, జనగామ నగర అంతర్గత రహదారులతో పాటు నేషనల్ హైవేలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇటీవల ఓ ఘోర ప్రమాదం..



కరుణాపురం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన అన్నాచెల్లె (ఫైల్)

హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్న హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన అన్నాచెల్లెలు సుమిత్‌రెడ్డి (23), పూజితరెడ్డి (21)లు ఈనెల తొమ్మిదిన ద్విచక్రవాహనంపై సొంతూరుకు బయల్దేరారు. డీపీఎస్ తండా వద్ద జాతీయ రహదారిపై ముందుకు వెళ్తున్న ఓ లారీని ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందారు. అతివేగంతో వెళ్తున్న బైక్ లారీ వెనుకభాగంలోకి చొచ్చుకెళ్లడంతో వారు బైక్‌పై ప్రాణాలొదిలారు.

అప్రమత్తతోనే ప్రమాదాల్ని ఆపొచ్చు..

డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు అప్రమత్తతోనే ప్రమాదాలు తగ్గేందుకు అవకాశముంది. అతివేగం, డ్రంకన్ డ్రైవ్‌ల వల్లనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల రోడ్డులో ఇంజనీరింగ్‌లో లోపంతోనూ బాగాలేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. అందుకే కమిషనరేట్‌లో ఎక్కువగా ప్రమాదాలు జరిగే హాట్‌స్పాట్‌లను గుర్తించి సంబంధిత విభాగంతో కలిసి మరమ్మతులు చేసే దిశగా ఆదేశాలిస్తున్నాం. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి అందరూ జాగ్రత్తగా ఉండాలి.

- ఏవీ రంగనాథ్, వరంగల్ పోలీస్ కమిషనర్

నెల	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
జనవరి	120	30	158
ఫిబ్రవరి	127	43	155
మార్చి	158	41	183
ఏప్రిల్	109	31	123
మే	170	46	155
మొత్తం	684	191	774

పాఠశాలలు షురూ..

విద్యారణ్యపురి: వేసవి సెలవులు ముగిసి సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజు ఎండ తీవ్రత కారణంగా పాఠశాలలకు విద్యార్థుల హాజరు శాతం తగ్గింది. కొన్ని పాఠశాలల్లో అంతంత మాత్రంగానే విద్యార్థులు హాజరయ్యారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల హాజరు ఇంకా తక్కువగానే ఉంది.. చిన్నపిల్లలు కావడంతో తల్లిదండ్రులు వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పంపలేదని సమాచారం. ఒక్క పూట బడిని వారం పాటు పెడితే బాగుంటుందనేది తల్లిదండ్రుల అభిప్రాయం. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో 400ల మంది విద్యార్థులకు కేవలం 50మంది మాత్రమే హాజరయ్యారు. ప్రభుత్వ మార్కజీ హైస్కూల్‌లో 803 మందికిగాను 150 మందే హాజరయ్యారు. మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులు చేతులు కడుక్కోవాలంటే వేడి నీళ్లు వస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందించారు.

విద్యార్థుల సంఖ్యను పెంచండి

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని డీఈఓ అబ్దుల్ హై అన్నారు. సోమవారం మడికొండ జిల్లా పరిషత్, ఎంపీపీఎస్, ధర్మసాగర్ బాలికల జిల్లా పరిషత్, ధర్మసాగర్ బాలుర జిల్లా పరిషత్, ఎంపీఎస్ బాలికలు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలకు, ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు.

మోగిన బడిగంట

కాశిబుగ్గ సెంటర్: వేసవి సెలవులు ముగియడంతో 2023–24 విద్యాసంవత్సరం సోమవారం ప్రారంభమైంది. జిల్లాలోని 1,021 ప్రభుత్వ పాఠశాలల్లో 1,20,552 మంది విద్యార్థులకు గాను 45,207 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈసందర్భంగా పలు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేసి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. మొదటిరోజు కావడంతో విద్యార్థులు పాఠశాలలకు రావడానికి ముందుకు రాలేదు.



ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో ప్రార్థనకు హాజరైన విద్యార్థులు

కేటీఆర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

వరంగల్/వరంగల్ చౌరస్తా: ఈనెల 17న రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ నగరంలో పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో దేశాయిపేటలోని 'డబుల్' ఇళ్లు, పోచమ్మమైదాన్‌లోని కళాభవనం, వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్, ఓసిటీ ఎదురుగా భారీ బహిరంగ సభ గ్రౌండ్, లక్ష్మీటౌన్‌షిప్ పక్కన 'డబుల్' ఇళ్లు తదితర ప్రాంతాలను సోమవారం అధికారులు పరిశీలించారు. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా దేశాయిపేటలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను జర్నలిస్టులకు, పేదలకు పంపిణీ చేయనున్నట్లు సమాచారం. ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, ఆర్డీఓ మహేందర్ జీ, బల్దియా ఇన్‌చార్జ్ అడిషనల్ అనిస్ ఉర్ రషీద్, ఆర్అండ్‌బీ, కుడా, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ఈవీఎంల పరిశీలన...

ఏనుమాముల వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని ఈవీఎంల గోదాంలను వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్లు శ్రీవత్సకోట, అశ్వినీ తానాజీ వాకడే, వరంగల్ ఆర్డీఓ మహేందర్‌జీ, మార్కెట్ కార్యదర్శి రాహుల్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

5 రోజులు వ్యవసాయ మార్కెట్ బంద్



వరంగల్ : వరంగల్ ఏనుమాముల మార్కెట్ ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు 5 రోజులు బంద్ ఉంటుందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎండల తీవ్రత కారణంగా గుమస్తా, హమాలీల విజ్ఞప్తి మేరకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ – ఇండస్ట్రీస్ లేఖతో బుధ, గురు, శుక్ర వారాల్లో సెలవులు ప్రకటిస్తున్నామన్నారు. 17వ తేదీ శనివారం యార్డు బంద్, 18వ తేదీ ఆదివారం వారాంతపు సెలవులతో మొత్తం ఐదురోజులు మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. 19వ తేదీన మార్కెట్ పునఃప్రారంభం అవుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు గమనించాలని కోరారు.

ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న యాదవరెడ్డి, కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే పెద్ది, చెరుకు సుధాకర్, ఎమ్మెల్సీలు కడియం, సారయ్య, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్యే సీతక్క, ఎంపీ దయాకర్



కుసుమానికి కన్నీటి వీడ్కోలు

అశ్రునయనాలతో ములుగు జెడ్పీ చైర్మన్ జగదీశ్ అంత్యక్రియలు

- చివరి చూపునకు తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- పార్థివదేహంపై బీఆర్‌ఎస్ జెండాకప్పిన మంత్రి కేటీఆర్
- కుటుంబ సభ్యులకు ఓదార్పు.. అండగా ఉంటామని హామీ
- పాడె మోసిన మంత్రులు, ప్రజాప్రతినిధులు
- తరలివచ్చిన అభిమానులు, పార్టీ శ్రేణులు..
- జనసంద్రంగా మారిన మల్లంపల్లి



అంతిమ యాత్రకు హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రజలు

ములుగు: బీఆర్‌ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్‌కు సోమవారం అభిమానులు, పార్టీ కార్యకర్తలు కన్నీటి వీడ్కోలు పలికారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మల్లంపల్లి జనసంద్రమైంది. జగదీశ్ ఆదివారం గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఆస్పత్రినుంచి ఆయన పార్థివదేహాన్ని తన స్వగ్రామమైన మల్లంపల్లికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఆయన చేసిన మేలును గుర్తుచేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు.

అధికార లాంఛనాలతో..

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అధికార లాంఛనాలతో కుసుమ జగదీశ్ అంతిమయాత్ర నిర్వహించారు. పోలీస్ శాఖ భారీ బందోబస్తు నిర్వహించింది. సుమారు గంటపాటు జరిగిన అంతిమయాత్రలో ఎండను సైతం లెక్కచేయకుండా అభిమానగణం పాల్గొంది. కుమారుడు వెంకట సత్యదేవ్ కుండపట్టారు. మధ్యాహ్నం 12: 35 గంటల సమయంలో స్థానిక వారి సొంతభూమిలో సంప్రదాయబద్ధంగా ఖననం చేశారు.

హాజరైన మంత్రి కేటీఆర్

రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ సోమవారం ఉదయం జగదీశ్ అంత్యక్రియలకు హాజరయ్యారు. బేగంపేట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లోమంత్రి పువ్వాడ అజయ్‌తోపాటు ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎంపీ రంజిత్ కుమార్ రెడ్డితో కలిసి వచ్చారు. జగదీశ్ భౌతికకాయంపై బీఆర్‌ఎస్ జెండా కప్పారు. పూలమాల వేసి నివాళులర్పించారు. పక్కనే ఉన్న తల్లి సులోచన, భార్య రమాదేవి, కుమార్తె హరిచందన, కుమారుడు సత్యదేవ్‌లు కేటీఆర్‌ను చూసి బోరున విలపించారు. దీంతో వారిని దగ్గరికి తీసుకొని ఓదార్చారు.

జనసంద్రంగా.. అంతిమయాత్ర

జగదీశ్ అంతిమయాత్ర జనయాత్రగా మారింది. ములుగు జిల్లాతోపాటు ఉమ్మడి వరంగల్, హైదరాబాద్, నల్లగొండ, కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులతో ములుగు, నర్సంపేట దారి కిక్కిరిసిపోయింది. మల్లంపల్లిలో చదువుకున్న 1991వ బ్యాచ్ మిత్రులు హాజరై జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎస్పీ గాష్‌ఆలం ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన దారిని వన్ వేగా మార్చారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల వాహనాలను మాత్రమే అనుమతించారు. జగదీశ్‌తో ఉన్న సన్నిహితంతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత సోమవారం ఉదయం నుంచి అంత్యక్రియల ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నారు. అంతకుముందు మంత్రి సత్యవతి, ఎంపీ కవిత, తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు పాడె మోసి అభిమానం చాటుకున్నారు.



జగదీశ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్



జగదీశ్ తల్లిని ఓదార్చుతున్న మంత్రి ఎర్రబెల్లి

ఆత్మీయ సోదరుడిని కోల్పోయా : కేటీఆర్

రెండు దశాబ్దాలపాటు సీఎం కేసీఆర్‌తోపాటు ఉద్యమంలో నిలిచి ఉత్తముడిగా ఉన్నాడు. నాకు ఆత్మీయ సోదరుడిగా ఉన్న జగదీశ్‌ను కోల్పోవడం బాధగా ఉంది. సీఎం ఏ పని చెప్పిన వెనుకడుగు వేయకుండా చేశాడు. చిన్న వయసులోనే మృతిచెందడం బాధాకరం. ప్రభుత్వం తరఫున కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం.

ప్రముఖుల నివాళి

జగదీశ్ పార్థివదేహాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, పువ్వాడ అజయ్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, విప్ ప్రభాకర్‌రావు, స్థానిక ఎమ్మెల్యే సీతక్క, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, అరూరి రమేశ్, బానోత్ శంకర్ నాయక్, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ, రాష్ట్ర రైతుబంధు సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజ్ సారయ్య, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, వరంగల్, మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్లు గండ్ర జ్యోతి, ఆంగోత్ బిందు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాష్‌రావు, రెడ్‌కో చైర్మన్ యారువ సతీష్ రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణ మోహన్ రావు, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, హనుమకొండ, ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లు అజీజ్ ఖాన్, గోవింద్ నాయక్, జెడ్పీటీసీలు సకినాల భవాని, రుద్రమాదేవి, తుమ్మల హరిబాబు, ఎంపీపీ శ్రీదేవి, మాజీ ఎంపీ సీతారాంనాయక్, అధికారులు ఉన్నారు.

నేటి నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- హాజరుకానున్న 1,81,286 మంది విద్యార్థులు
- 131 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ, బీఎల్‌బీ, ఒకేషనల్ కోర్సుల్లో 2వ , 4వ, 6వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్ సోమవారం తెలిపారు. రెండో సెమిస్టర్‌కు 71,204 మంది, 4వ సెమిస్టర్‌లో 64,900 మంది, 6వ సెమిస్టర్‌లో 45,182 మంది విద్యార్థులు మొత్తం 1,81, 86 మంది పరీక్షలు రాయబోతున్నారు.ఈపరీక్షల నిర్వహణకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 48 , ఆదిలాబాద్ జిల్లాలో 50, ఖమ్మం జిల్లాలో 33 మొత్తం 131 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 13, 15, 17, 20, 22, 24, 27, 30, జూలై 4 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. 4వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 14,16, 19, 21, 23, 25, 28, జూలై 3, 5, 7వ తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. 6వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 13, 15, 17, 20, 22, 24, 27, 30, జూలై 4, 6,10, 11, 12, 13, 14 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని వారు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి మొత్తం 4,275 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 430 మంది గైర్హాజరయ్యారు. 3,845 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంట వరకు నిర్వహించిన పరీక్షలో మొత్తం 1,145 మంది విద్యార్థులకు గాను 119 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

వరంగల్ జిల్లాలో..

కాశీబుగ్గ/కాజీ సెంటర్: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి మొదలైనట్లు ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారి కాక మాధవరావు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలో మొత్తం 1,501 మంది అభ్యర్థులకు 1,358 మంది పరీక్షలకు హాజరు కాగా 143 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. సెకండ్ ఇయర్ పరీక్షలో 643 మంది విద్యార్థులకు గాను 613 మంది పరీక్షకు హాజరు కాగా 30 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

14 నుంచి టెన్త్ సప్లిమెంటరీ

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఈనెల 14 నుంచి 22వ తేదీ వరకు టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈఓ ఎండి అబ్దుల్‌హై సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలు పరీక్షా కేంద్రాలుగా ఉన్నాయి. ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లను, ముగ్గురు డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియమించారు. జిల్లాలో 1,116 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు ఉదయం 8:45 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఉదయం 9:35 తర్వాత అనుమతించరు.

వరంగల్ జిల్లాలో..

కాశీబుగ్గ/కాజీ సెంటర్: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు వరంగల్ డీఈఓ వాసంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు 1,024 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, ఇందుకు మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల విషయమై 8919974862 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఐటీఐ దరఖాస్తుల గడువు పొడిగింపు

కాజీపేట: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ఈనెల 19 వరకు పొడిగించినట్లు జనగామ జిల్లా కన్వీనర్, కాజీపేట ఐటీఐ ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.iti.telangana.gov.in లో లాగిన్ కావాలన్నారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

భార్య, పాపను చూసేందుకు వెళ్తూ మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



యాకాంబ్రం (ఫైల్)

నెక్కొండ/ కేసముద్రం : తనకు మరో మహాలక్ష్మి జన్మించిందనే సంతోషంతో ఓ వ్యక్తి.. బైక్‌పై భార్య, పాపను చూసేందుకు వెళ్తున్నాడు. ఈక్రమంలో మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో అతనిని కబలించింది. ఈ ఘటన సోమవారం నెక్కొండ మండల కేంద్రంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం (స్టేషన్)లోని కిష్టాపురానికి చెందిన మందాటి యాకాంబ్రం (37) కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. 9 సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన లావణ్యను కులాంతర వివాహం చేసుకోగా ఆ దంపతులకు కూతురు ఆరేళ్ల అరణ్య ఉంది. ఈ క్రమంలో ఈ నెల 11న వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రిలో రెండో సంతానంగా పాప జన్మనించింది. ఈ విషయం తెలుసుకున్న యాకాంబ్రం అదే రోజు రాత్రి తన భార్య, పాపను చూసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అప్పల్‌రావుపేట– నెక్కొండ రహదారి వద్ద చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తుమని ఎస్సై జానీపాషా తెలిపారు. కాగా, యాకాంబ్రం తెలంగాణ ఉద్యమంలో చు రుకుగా పనిచేశారు. 2011 ఫిబ్రవరి 22, 23 తేదీలలో 48 గంటల రైల్ రోకో చేపట్టారు. ఈ సమయంలో మణుగూరు ప్యాసింజర్‌కు నిప్పు పెట్టిన ఘటనలో యాకాంబ్రం ప్రధాన నిందితుడు. కాగా, ఎమ్మెల్యే శంకర్‌నాయక్.. యాకాంబ్రం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

శుభకార్యానికి వెళ్లొస్తూ దుర్మరణం..

- వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం
- భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



సుమతి (ఫైల్)

ఖిలా వరంగల్: మరో రెండు అడుగులు వేస్తే ఇంట్లోకి క్షేమంగా చేరుకునే వారు.. ఆ లోపే ఆ దంపతులను మృత్యువు వెంటాడింది. ఆటో దిగి రోడ్డు క్రాస్ చేస్తుండగా వేగంగా వస్తున్న క్రేన్ వెహికల్ వారిని ఢీకొంది. దీంతో భార్య అక్కడిక్కడే దుర్మరణం చెందగా భర్త తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు . ఈ హృదయ విదారక ఘటన పలువురిని కంటతడికి గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే వరంగల్ ఫోర్ట్ రోడ్డు విద్యానగర్ కాలనీకి చెందిన కాలువ సుమతి (82) , బాలరాజు (82) దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన శుభకార్యానికి వెళ్లి సోమవారం ఉదయం 5గంటలకు వరంగల్‌కు చేరుకున్నారు. వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ జంక్షన్‌లో ఆటో ఎక్కి ఇంటికి బయల్దేరారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని సాయిబాబా గుడి కమాన్ సమీపంలో ఆటో దిగి రోడ్డు క్రాస్ చేస్తుండగా వరంగల్ నుంచి వేగంగా వస్తున్న క్రేన్ వెహికల్ వారిని ఢీకొంది. దీంతో సుమతి అక్కడికక్కడే దుర్మరణం చెందగా బాలరాజు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే బాలరాజును 108లో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారని బంధువులు తెలిపారు. ఘటన స్థలానికి మిల్స్‌కాలనీ పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. విషయం తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో విద్యానగర్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అశ్రునయనాల మధ్య భవ్య అంత్యక్రియలు

కురవి: ప్రియుడు పెళ్లికి నిరాకరించడం.. పెద్దలు పంచాయి తీ చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన బీటెక్ విద్యార్థిని సాతర్ల భవ్య అంత్యక్రియలు సోమవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ గ్రామంలో భవ్యకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. పోస్టుమార్టం అనంతరం భవ్య మృతదేహాన్ని పోలీసుల భారీ బందోబస్తు మధ్య గ్రామానికి తీసుకొచ్చారు. అనంతరం భవ్యకు, జిల్లేడు చెట్టుకు పెళ్లి చేశారు. ఈ సమయంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. అనంతరం భవ్య మృతదేహాన్ని శ్మశానవాటిక వద్దకు తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు. కాగా, మృతురాలి తల్లి ఉమ ఫిర్యాదు మేరకు ప్రియుడు రుద్రారపు వినయ్, అతడి తల్లిదండ్రులు శ్రీనివాస్, సుభద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము సోమవారం తెలిపారు.

నూకశాతం అధికంగా ఉండే ధాన్యం తీసుకోం

- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్‌కుమార్

న్యూశాయంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రారైస్ ఎఫ్‌సీఐ ద్వారా మాత్రమే సేకరిస్తున్న నేపథ్యంలో అధిక నూక శాతం కలిగిన 1001 ధాన్యాన్ని భవిష్యత్‌లో దిగుమతి చేసుకోబోమని వరంగల్ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ రకం ధాన్యాన్ని తాము సేకరిస్తే ఎఫ్‌సీఐ తిరస్కరిస్తోందన్నారు. గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన లక్షకు పైగా టన్నుల ధాన్యం నిల్వలు మిల్లుల లోనే పోరుకుపోయాయన్నారు. దీంతో మిల్లర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా ఫలితం దక్కలేదన్నారు. తమ బాధను అర్థం చేసుకుని రైతులు 2023–24 ఖరీఫ్ సీజన్‌లో 1001 రకం వరి సాగు చేపట్టొదన్నారు. వానాకాలంలో ఎంటీయూ, ఎంటీయూ1061, ఆర్‌ఎస్‌ఆర్, హెచ్‌ఎంటీ, సోనా, బీపీటీ, 5204, స్వర్ణ తదితర రకాలను పండించాలని సూచించారు. అలాగే, వ్యాపారులు కూడా 1001 రకం విత్తనాలు విక్రయించకుండా తమకు సహకరించాలన్నారు.

నిట్‌లో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ఎంటెక్


కాజీపేట అర్బన్ : దేశంలోనే తొలిసారి నిట్ వరంగల్‌లో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో ఎంటెక్ కోర్సును ప్రారంభించినట్లు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. నిట్ సెమినార్ హాల్‌లో సోమవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డీఎస్టీ) యాక్సలరేటెడ్ విజ్ఞాన్ ప్రాజెక్ట్‌లో భాగంగా 'మెటీరియల్ సైన్స్ అండ్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్' అనే అంశంపై ఏర్పాటు చేసిన హై ఎండ్ రీసెర్చ్ ట్రైనింగ్‌ను ప్రారంభించి మాట్లాడారు. నిట్ వరంగల్‌లో మెటల్ త్రీడీ ప్రింటింగ్ అందుబాటులో ఉందని, నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌తో నిట్ ఎంవోయూ కుదుర్చుకుందని తెలిపారు. నిట్ వరంగల్ బెంగుళూరులోని సీఎంటీఐ సౌజన్యంతో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ఎంటెక్ కోర్సును ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఎస్ఐఆర్ ,సీజీసీఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ వంశీకృష్ణ, బెంగుళూరు జీఈ ఏవియేషన్స్ ప్రొఫెసర్ ఉమామహేశ్వర్, మంజయ్య, రవికుమార్, ఆడెపు కుమార్, సురేశ్‌బాబు, రీసెర్చ్ స్కాలర్స్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

ఆర్‌ఈ మాస్ట్‌ల తరలింపు..

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌కు 3వ లైన్ నిర్మాణంలో భాగంగా విద్యుత్ ఏర్పాటు కోసం ఆర్‌ఈ మాస్ట్‌లు కాజీపేట జంక్షన్ నుంచి (3వ లైన్ నిరా ్మణం పూర్తయిన తర్వాత ట్రాక్‌కు పక్కన ఏర్పాటు చేసే విద్యుత్ స్తంభం) తరలిస్తున్నారు. కాజీపేట–బల్లార్షా, కాజీపేట–విజయవాడ మార్గాలలో 3వ లైన్ నిర్మాణంలో భాగంగా ఓహెచ్‌ఈ విద్యుత్ విభాగానికి సంబంధించిన ఆర్‌ఈ మాస్ట్‌లను భారీ వాహనాలలో ఆయా రూట్‌లకు తరలిస్తున్నట్లు కాజీపేట రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. కాగా, ఈ ఆర్‌ఈ మాస్ట్‌లు ఏర్పాటు చేసిన తర్వాత విద్యుత్ విభాగం అధికారులు ఓహెచ్‌ఈ విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన అనంతరం రైళ్ల ట్రాఫిక్ కొనసాగుతుందని తెలిపా రు. కాగా, భారీ వాహనాలలో తరలిస్తున్న ఈ ఆర్ ఈ మాస్ట్‌లను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.



కాజీపేట నుంచి వాహనాల్లో తరలుతున్న ఆర్‌ఈ మాస్ట్‌లు